క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే ముస్లింలకు న్యాయం



కరపత్రాలను చూపుతున్న ముస్లింలు

నల్లచెరువు: సీఎం జగన్‌తోనే ముస్లింలకు న్యాయం జరిగిందని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మొగల్ నూరుల్లా తెలిపారు. మండలంలోని అల్లుగుండు, బ్రాహ్మణపల్లి, మూర్తిపల్లి, సున్నపుగుట్ట తాండ గ్రామాల్లో మంగళవారం 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాషా ఖాన్, ఏహాసన్ తదితరులున్నారు.

రేపు శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ రాక

పుట్టపర్తి అర్బన్: కుమ్మరి, శాలివాహన వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం గురువారం జిల్లా కేంద్రం పుట్టపర్తికి రానున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని తిరిగి వెళ్తారన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం అలవరుచుకోవాలి



ర్యాలీ చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవరుచుకుంటే అనారోగ్యాల నుంచి దూరం కావచ్చని కదిరి పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వాహకులు జయచంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కటారుపల్లి యోగివేమన సమాధి వద్ద మంగళవారం బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ స్మరణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానంతో ఆరోగ్యంలో వచ్చే మార్పులు, శాఖాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిరమిడ్ మాస్టర్స్ చలపతి, రాజేష్ తదితరులున్నారు.


ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న బత్తల వెంకటరమణ

ఎన్‌పీ కుంట: మండల పరిధిలోని మేకలచెరువు పంచాయతీ కొండమూల కటకంవారిపల్లికి గ్రామానికి చెందిన కళాకారుడు వడ్డె శంకర్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తలహరిప్రసాద్ మృతుని దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు.

అర్హులందరికీ ఓటు హక్కు



జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

బత్తలపల్లి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదు చేస్తామని తహసీల్దార్ యుగేశ్వరీదేవి తెలిపారు. మంగళవారం బత్తలపల్లి మండలంలో జరుగుతున్న ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బత్తలపల్లిలో బీఎల్‌ఓలు ముత్యాలప్ప, నరసింహులు ఓటరు సర్వేను చేస్తుండగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట వీఆర్‌ఓలు రవికాంత్‌రెడ్డి, భరద్వాజ్‌బాబు ఉన్నారు.

ఆర్డీఓ పరిశీలన

కదిరి అర్బన్: మండల పరిధిలోని బూరుగుపల్లిలో మంగళవారం ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆర్డీఓ రాఘవేంద్ర పాల్గొన్నారు. చనిపోయిన వారిని రెండేళ్లుగా తొలగించకపోవడంతో 2 శాతం దాటిందని తెలిపారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: ముదిగుబ్బలో ఓటరు జాబితాను మంగళవారం బీఎల్‌ఓలు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, భాస్కర్, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి

నల్లమాడ: ఓటర్ల పరిశీలన, జాబితా తయారీ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ బీఎల్‌ఓలను ఆదేశించారు. మండలంలో ఓటరు పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్‌లలో ఓటరు పరిశీలన ఏవిధంగా జరుగుతోందో పరిశీలించారు.

జగనన్న పాలనలో అంతా సుభిక్షం

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మద్దెలచెరువులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నామన్నారు. కనగానపల్లి మండలంలోని 4,459 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేయించటంతో జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లు నిర్మించి, ఇస్తున్నామన్నారు. వైఎస్సార్ జలకళ పథకంతో పాటు తోపుదుర్తి ట్రస్టు ద్వారా మండలంలో వెయ్యి మందికిపైగా రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నామని పేర్కొన్నారు.

పరిటాల కుటుంబానిది పెత్తందారి పోకడ:

గతంలో గ్రామాల్లో ఉన్న ఫ్యాక్షన్, వర్గాలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు సాగించిన పరిటాల కుటుంబం అంతా పెత్తందారి పోకడలను ప్రోత్సహించిందని ఎమ్మెల్యే అన్నారు. తద్వారానే 20 ఎకరాల పొలం ఉన్న యజమానుల నుంచి రూ.2 వేల కోట్ల ఆస్తులకు పడగలెత్తారని విమర్శించారు. టీడీపీ హయాంలో వారు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. దీనికి తోడు వారు సాగించిన ఫాక్షన్ రాజకీయాలతో మద్దెలచెరువు, తగరకుంట, కనుముక్కల వంటి గ్రామాల్లో ఎంతో మంది ప్రాణాలను బలితీసుకున్నారన్నారు. ప్రస్తుతం తాము ప్రజలకు ప్రశాంతమైన సుపరిపాలన అందిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. మద్దెలచెరువులో 600 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహారెడ్డి, పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్య స్థాపన తీసుకొచ్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భానుకోటలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు మండల కేంద్రంలో మొహర్రం సందర్భంగా దస్తగిరి, కుళ్లాయిస్వామి పీర్లను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. పంచాయతీరాజ్ డీఈ రసూల్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ బెడుదూరి గోపాల్‌రెడ్డి, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతీప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, కాంట్రాక్టర్ పరంధామరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

• ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొర్తికోట, మంగదిన్నెపల్లి, తోడేళ్లగడపల్లి గ్రామాలలో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామ వలంటీర్లతో సంక్షేమ ఫలాలు తమకు సక్రమంగా అందుతున్నట్లు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు చెప్పారు. ఇంకా పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. కొర్తికోట, మంగదిన్నెపల్లిలో వీధులలో అక్కడక్కడ మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను వేయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు తెలిపారు. అధికారులతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎస్టిమేషన్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్లో మీడియా సహకారంతో చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్, ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై బురద జల్లడానికి యత్నిస్తున్నారని, వీరి మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, సర్పంచ్ కే. లక్ష్మీ నరసమ్మ, ఎంపీటీసీ ఆదినారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు రామ్‌దేశాయ్, వినోద్‌కుమార్, నాయకులు శ్రీనివాసుల నాయుడు, గంగప్పనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, సమరసింహారెడ్డి, జనార్దన్‌నాయుడు, నీలకంఠారెడ్డి, గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



కొర్తికోటలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

తనకల్లు: స్థానిక 30 పడకల ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని వైద్యాధికారి ముబీషీరా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం తొమ్మిది మంది వైద్యులను ప్రభుత్వం నియమించిందన్నారు. ఆసుపత్రిలో రోజూ 300 మంది అవుట్ పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి సహకారంతో ఆసుపత్రి ఆవరణంలో బెంచీలతో పాటు పెద్ద లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యుడు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

గెస్టు లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటిక్స్, జువాలజీ, బోటనీ, ఇంగ్లిష్, కామర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఈనెల 28లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్లు

అమడగూరు: అర్హులైన వారందరికీ జగనన్న ఇళ్లను మంజూరు చేస్తామని ఓడీ చెరువు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజునాయుడు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాపల్లి పంచాయతీ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను పరిశీలించారు. హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా



బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

అమడగూరు: అధైర్య పడొద్దని అండగా ఉంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. మంగళవారం ఎమ్మెల్యే మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఇటీవల మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మలకవారిపల్లి, కొత్తపేట, మహమ్మదాబాద్, కొళిమిరాళ్లపల్లి, బలకవారిపల్లి గ్రామాల్లో మృతుల కుటుంబీకులతో మాట్లాడి ఆత్మస్థైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భర్త శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఈశ్వరయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇదే గ్రామానికి చెందిన రమాదేవి, చంద్రాయునిపల్లికి చెందిన పార్టీ నాయకుడు ప్రసాద్ కుమారుడు విజయ్‌భాస్కర్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి కేశప్ప, సర్పంచ్ రమణయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లమాడ: చౌటకుంటపల్లికి చెందిన శ్రీనివాసులు మూడు రోజుల క్రితం మృతిచెందాడు. వైఎస్సార్ బీమా కింద రూ. లక్ష సాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. తక్షణ సాయం రూ. 10 వేలను మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని భార్య అనూషకు అందజేశారు. సర్పంచ్ లింగమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్ తదితరులున్నారు.

గ్రామాలకు ప్రభుత్వ పాలన

తాడిమర్రి: ప్రభుత్వ పాలన గ్రామాలకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటవరద, వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, మండల ప్రత్యేక అధికారి రామాంజినేయులు, ఎంపీడీఓ విజయలక్ష్మీ, తహసీల్దార్ నాగరాజు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు పొరాళ్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, జొల్లిరెడ్డి అశ్వర్థ, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, అగిలే బాస్వంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

'జగనన్న సురక్ష'తో ఇళ్ల వద్దకే ధ్రువపత్రాలు

తాడిమర్రి: 'జగనన్న సురక్ష' కార్యక్రమంతో ప్రజలకు ఇళ్లవద్దకే పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్ వెంకటవరద, వైస్ ఎంపీపీ బీసాని లింగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మీ, తహసీల్దార్ నాగరాజు, ఈఓఆర్డీ కామాక్షి, ఏపీఓ సంజీవరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, జొల్లిరెడ్డి రామన్న, కృష్ణారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువ

బత్తలపల్లి: 'జగనన్న సురక్ష' సదస్సులతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. మంగళవారం మండలంలోని మాల్యవంతం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ సౌజన్యకుమారి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైస్‌ఎంపీపీ సాకే పార్వతి, సీఎస్‌డీటీ శారద, ఈఓఆర్డీ దివాకర్, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. 2,314 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కార్యదర్శి గంగరత్నమ్మ, వీఆర్‌ఓ మణికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ ఆదెప్ప, వెంకటరాముడు, పోతలయ్య, బోయపాటి సూరీ, తదితరులున్నారు.



నల్లచెరువు: ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం

నల్లచెరువు: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఎంపీపీ రమణారెడ్డి అన్నారు. మండలంలోని తలమర్లవాండ్లపల్లి సచివాలయ పరిధిలోని యర్రగుంటపల్లిలో మంగళవారం కార్యక్రమాన్ని ఎంపీడీఓ శకుంతల, తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్లు జొన్నా ఆదిమూర్తి, కుళ్ళాయమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1,640 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'సురక్ష' గ్రామ సభలు

పుట్టపర్తి అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో చివరి రోజు మంగళవారం అమగొండపాళ్యం గ్రామంలో 750 సేవా సర్టిఫికెట్లు అందజేసినట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేకాధికారి సుభదాస్ పేర్కొన్నారు. మండలంలోని 10 సచివాలయాల్లో మొత్తం 9,620 సేవా సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు. అమగొండపాళ్యంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు.ఎంపీటీసీ కుల్లాయప్ప, సర్పంచ్ రామచంద్ర తదితరులు ఉన్నారు.

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని తహసీల్దార్ షాబుద్దీన్ అన్నారు. మంగళవారం న్యామద్దల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 998 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వినతి

కదిరి అర్బన్: కదిరి పట్టణంలో ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యామండలి ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నజీర్ అహమద్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా పూర్తి డబ్బు చెల్లించాకే ఇస్తామని వేధిస్తున్నారని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాసంస్థల బంద్

కదిరి అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మహేంద్ర, హేమంత్, కిషోర్, నరసింహా, రాజేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పీర్లచావిడి మరమ్మతులకు విరాళం అందజేత

అమడగూరు: అమడగూరులోని పీర్లచావిడి మరమ్మతులకు జెడ్పీటీసీ దంపతులు కవిత, శివశంకర్ రెడ్డి రూ. 30 వేలు విరాళంగా ఇచ్చారు. కొన్నేళ్లుగా పీర్లచావిడికి ఉన్న గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ తరుణంలో జెడ్పీటీసీ దంపతులు ముందుకు వచ్చి గేట్లు, ఇతర మరమ్మతులకు అవసరమయ్యే మొత్తాన్ని మంగళవారం విరాళంగా ఇచ్చారు. నిర్వాహకులు వారికి కృతజ్ఞతలను తెలియజేశారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

అమడగూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఓడీచెరువు మండలంలో మంగళవారం పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను సీపీఐ నాయకులు దహనం చేశారు. సభ్య సమాజం తల దించుకునే పనులు చేసినా నిందితులను ఎందుకు శిక్షించలేదంటూ మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ఏమాత్రం న్యాయం చేయని బీజేపీని 2024 ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంజినేయులు, మండల కార్యదర్శి చలపతి, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడలో నిరసన

నల్లమాడ: ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకొని మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను వెంటనే ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న వరుస సంఘటనలకు నిరసనగా మంగళవారం స్థానిక బస్టాండ్ కూడలిలో సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, అర్ధనగ్న ప్రదర్శనలు జరుగుతున్నా మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి వెంకటరమణ, నాగేంద్ర, రమణ, ఆదిలక్ష్మి, జానకి, ఆయాసాబ్, లక్ష్మీదేవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అఘాయిత్యాలు ఆపాలి

పుట్టపర్తి టౌన్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు నరేంద్రమోదీ తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. గణేష్ కూడలిలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేసి మోదీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నియోకవర్గం కార్యదర్శి అంజనేయులుతోపాటు సీపీఎం, సీపీఐ నాయకులు ఇంతియాజ్, రామకృష్ణ, వెంకటేష్, గంగాధర్, అంజనేయులు తదితరులున్నారు.

వృద్ధులకు అన్నదానం

తాడిమర్రి: మండలంలో నార్సింపల్లి గ్రామంలోని వృద్ధాశ్రమంలో ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన వేలూరు నాగార్జున, వేలూరు కౌసల్య దంపతులు మంగళవారం అన్నదానం నిర్వహించారు. నాగార్జున తల్లి వేలూరు లక్ష్మీదేవి వర్ధంతి పురస్కరించుకుని వృద్ధులకు భోజనాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోజిత్, కుమార్తె చక్రిక, ఆశ్రమ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

27 వరకూ తాగునీటి సరఫరా బంద్

కదిరి టౌన్: పట్టణంలో ఈ నెల 27 వరకూ తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విధుల్లో చేరిన ఎంఆర్‌సీ

తలుపుల: స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా మధుసూదన్‌రెడ్డి మంగళవారం విధుల్లో చేరారు. ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమకు జీవనోపాధి అవకాశాలు కల్పించారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తమ కుటుంబాలు రుణపడి ఉంటాయని మధుసూదన్ రెడ్డి తెలిపారు.

సచివాలయం తనిఖీ

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో సచివాలయాన్ని చైర్మన్ తుంగా ఓబులపతి మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బందితో సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకుడు కోగిర సుబ్రమణ్యం తదితరులున్నారు.

రైతు సదస్సు జయప్రదం చేయండి

ధర్మవరం: సంయుక్త రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న కదిరిలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, మండల కార్యదర్శి మారుతిలు పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగరాజు, శ్రీరాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు న్యాయం

రామగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అన్నివర్గాల వారికీ న్యాయం జరుగుతోందని తహసీల్దార్ నారాయణస్వామి, జెడ్పీటీసీ నాగార్జున తెలిపారు. మంగళవారం మండలంలోని ఎంసీపల్లి గ్రామంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధన్న, ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

గాండ్లపెంట: ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎంఈఓ క్రిష్టానాయక్ తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన పాఠశాల సముదాయాల సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు.

అసత్య ఆరోపణలతోనే నిందితుడి ఆత్మహత్య

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: పోక్సో కేసులో నిందితుడు, తనకల్లు మండల కేంద్రంలో నరసింహులుపై పోలీసులు అసత్య ఆరోపణలు చేయడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు బి. నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం డీఐజీ కార్యాలయంలో మేనేజర్‌కు న్యాయవాది ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి, చట్టపరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డికి కూడా ఫిర్యాదు చేశామన్నారు.